
AROGYAMU.

(A Health Drama.)



12/50

By

K. H. V. S. NARAYANA, B. A., L. T.,

(*Sahiti Samiti.*)

Deputy Inspector of Schools, Nandigama.

VENKATARAM & Co.,

Publishers, Booksellers etc.

BEZWADA.

1924.

Printed at the Rama Press, Ellore.
First Edition, 1000 copies.

ఆరోగ్యము.

(ఏకాంక నాటకము.)

కె. హెచ్. వి. యన్. నారాయణ బి. ఏ; యల్. టి.

(సాహితీసమితి)

డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్సు, నందిగామ రేం॥



ప్రకాశకులు

వేంకటరామ్ అండ్ కో,


బుక్ సెల్లర్సు,

బెజవాడ.

రామా ముద్రాక్షరశాల ఏలూరు.

1924.







ఆరోగ్యము.

(ఏకాంక నాటకము.)

నాంది

సూత్రధారుడు (ప్రవేశించి)

శ్రీ ప్రజాహితు డాదరంబున
జీవకోటికి సేమ మొదవగ
గొల్వజూపిన శుచిరయొసంగుత
కూర్మిమీకు చిరాయువున్.

(పుష్పాంజలి చల్లి నిష్క్రమించును.)

మొదటిరంగము.

ప్రమత్తనరపాలుని దర్బారు.

ప్రవేశము—ప్రమత్తనరపాలుడు; యువరాజగు ప్రజాహితుడు; మంత్రులు; వైద్యుడు; ఆచార్యుడు.

ప్రమ—మంత్రివర్యా! నేడేల మన సభ యింత వెలుచగా దోచుచున్నది?

తే. గీ. ఇసుక జల్లిన రాలుట కెడములేని
మన సభలు నేడు పలుచనై కనబడంగ
కారణంబేది తెల్పు వేగమున మాకు
మనము శాంతిని వీడెనో మంత్రివర్య !

1. మంత్రి—క్రిందటిసభ జరిగిన నాటినుండియు మనప్రజలు సుఖము దప్పి యున్నారు.

తే. గీ. ఏమి విన్నప మొనరింతు భూమిపాల
వ్యాధి పీడితులై మన ప్రజలలోన
రెండు వంతులు మడిసిరి మృత్యువాత
ఉన్నవారు దానను బడనున్నవారు.

ప్రజా—అయ్యో ! యింతకాలమేల యుపేక్ష జరిగెను ?

(దౌవారికుడు ప్రవేశించును.)

దౌవా—దేవరా ! యెవళ్ళో వొచ్చి నాను నిద్దరోతూంటే లేపి మీాకు కబురు సెయ్యమని సంపుకు తింటున్నారు.

ప్రమ—ఎవరువారు ?

ప్రజా—ఎవరైననేమి ? దేవర దర్శనమునకై వచ్చియుండ నోవు. వారిని రమ్మనుట మంచిది.

ప్రమ—సేవకా ! వారిని తోడ్కొనిరమ్ము.

సేవ—సిత్తం. (నిష్క్రమించును.)

ప్రమ—వీర లెవ్వరై యుందురో !

2. మంత్రి—స్వామీ ! వారలే వచ్చుచున్నవారు.

(దౌవారికుడు పౌరులతో ప్రవేశము.)

పౌరులు—
గేయము.

భూపా మాపై కనికరముంచి
బ్రోవుము మరిమరి మ్రొక్కెదము

1. పౌరుడు—మా రెమ్మ వొచ్చించి మాకొంప తీసింది
పెళ్ళాము సచ్చింది పిల్లాడుకూడ॥ భూపా॥

2. పౌరుడు—సాకలీధికి నేను సావక మిగిలాను
కలరాటదానమ్మ కడుపుహూడ॥ భూపా॥

3. పౌరుడు—అమ్మోరు యిసిరింది అందర్ని కొట్టింది
తుడిసేసిపోయింది గుడిసె లన్నింటి॥ భూపా॥

4. పౌరుడు—సుక్కల్లో చంద్రుణ్ని తొక్కేసేపిల్లాకి
వళ్ళల్లా పుళ్లేను కళ్ళల్లొ కాయాలు
కొద్దోళ్ళకష్టాలు గొప్పోళ్ళకేమెరిక॥ భూపా॥

ప్రజా—తండ్రీ ! నేనింక వీరికష్టముల వినలేను. పౌరులారా! మీరరుగుడు. మీకుసాయముచేయుటకు యత్నించెదను.

(పౌరులు నిష్క్రమింతురు.)

మంత్రీ ! వీరి కష్టముల బాపుటకు ప్రయత్న మేమి చేసితివి ?

3. మంత్రి—దేవా । ఆస్థానవైద్యునకు పదివేల రూప్యముల నిచ్చి తగిన మందుల జేయ కోరియుంటిని.

వైద్యుడు—స్వామీ ! నాశక్తికొలది మేలైన యౌషధముల
చేసి జనుల కిచ్చుచునే యుంటిని.

తే. గీ. వ్యాధి కుదర్చవచ్చును నౌషధంబు
వలన గాని యాయువునకు గలదె మందు
శక్తికొలదినే వైద్యంబు జరుపుచుంటి
కర్మ ఫలముగ మృత్యువు గలుగకున్నె ?

ప్రజా—ఆచార్యోత్తమా ! మనకు దైవబలము లేకుండుటకు
కారణమేమి ?

ఆచా—దైవమన్న మనపౌరులకు భక్తిలేకున్నది. వారు
మూఢులై సంచరించుచున్నారు.

ప్రజా—నాయనా !

తే. గీ. వ్యాధియందరి నొకసారి బాధపెట్ట
కారణంబెద్దియో యుండు గాననేను
ప్రక్క దేశంబులకుబోయి వానినరసి
మంచి పద్ధతులను గొని మరలివత్తు.

ప్రభు— అట్లనే కానిమ్ము; కాని వేగముగ నీవుమరలి రమ్ము.
(యువరాజు నిష్క్రమించును.)

మంత్రులారా ! గ్రామదేవతలకు జాతరలుక్రమముగా
జరిగింపుడు. మీరెల్లరుజని యుచితరీతుల ప్రయత్నింపుడు.
(అందరు నిష్క్రమింతురు.)

రెండవరంగము.

ఆరోగ్య చక్రవర్తి దర్బారు.

ప్రవేశము—ఆరోగ్యమహారాజు; మంత్రులు: తేజుడు, అనిలుడు, శుభ్రుడు.

ఆరోగ్య—సర్వశోభా యుతంబౌచును
సర్వకాలమునందు వెల్గుచు
నేడ దేలకో మీదు మోములు
వాడియున్నవి తెల్పుడీ.

లోకంబున జనులందరు సుఖంబున నున్నవారే ?

తేజుడు—దేవా ! యేమని మనవిచేయుదును. ప్రమత్త పుర వాసు లనేకులు మన శత్రువైన మృత్యురాజు పాలగుచున్నారు.

ఆరోగ్య—మీరెల్లరు కావాడుచుండ మృత్యు భటులెట్లు వారిని పట్టగల్గిరి ?

తేజుడు—నరనాథ ! యేమని చెప్పుకొందును
నన్ను జూచిన వారేవగింతురు
మూల మూలల నిరికియుండుట
కూలిపోయిరి మృత్యువాతను.

ఆరో—అనిలా ! నీ ప్రయత్నము లేమయ్యె ?

అని— గే. దేవా నేనేమి దెల్పుదునయ్యా
అందు నాలోప మావంత లేదయ్యా
సేనల నన్నింటి చెరబట్టివేయ
వీసమైన కదల వీలు లేదయ్యా.

ఆరో— ఆహా ! ఎంత వైపరీత్యము. తేజోనిలు లిట్లు పరాజయమొందుట మున్నెన్నడు నెరుగము. శుభ్రుడా ! నీ వార్త యేమి ?

శుభ్రు— గే. రాజచంద్రామానిసుల్ నారాక జూచిన రోసివే
గ్రాలుచుందురు మురికిలోపల కానవన్ క్షమియింపవే.

ఆరో— ప్రమత్తులై వారు మిమ్ము దూషించినందులకు ఫలము వారనుభవించుచునే యున్నారు. ఏమైనను, లోకోపకార దీక్ష గల మనము వారిని వదలకూడదు. వారు త్వరలోనే పశ్చాత్తాపమును బొందుదురు. ఆ తరుణము వేచి యుండి మీరు వారిని కాపాడుడు. జాగుసేయక మీ రచ్చోటికి పొండు.

మంత్రులు— చిత్తము, స్వామీ !

(అందరు నిష్క్రమింతురు.)

మూడవరంగము.

మృత్యురాజు దర్బారు.

ప్రవేశము — మృత్యురాజు; మంత్రులు — మలినుడు, అమితుడు, వ్యసనుడు, తిమిరుడు.

మృత్యు-గే. ప్రమత్తపురిలో ప్రజలను బట్టిన
చందము దెల్పుడి మీరందరును
వినుటకు నామది వేడుక బుట్టెను
విశదపరపుడీ ప్రియతములారా.

మలినుడా ! నీవు ప్రారంభింపుము.

గేయము.

మలినుడు- పెంటకుప్పల నింటి ముందర
వేసియుంచగ జేసితిక్
ఈగదోమలు నెల్ల వేళల
నిండ్లలో వసియించెదుర్.॥
మురికిబట్టలు నీరుగాలియు
ముద్దుగొల్పును ప్రజలకయ్యెడ
ముచ్చటించితి నాప్రతాపము
మోదమున మీ చెంగటన్.॥

మృత్యు— సెబాస్ ! యెట్టి యుపకారమును జేసితివి !
గే. మరువాజాలా, మలినుడనీమంచి తనమునే
మరువాజాలా॥

చల్లగజనులను చంపుశక్తినీ
సాటివారలిలకల్లా మాటలువేయికనేలా॥ మరువ॥

అమితుడా! నీ పరాక్రమమును వచింపుము.

అమి-తే. గీ. కడుపుమానము తెలియక గుడుచుచుంట
వ్యాధులన్నిటికి జనులు పాత్రులైరి
మితముమీరఁజేసిన నాదు మేలుదలప
వేడుకొందును దయజూడ పృథ్వీపాల.

మృత్యు-గే. తరమానినుబొగడా. నా, తరమాయమితుండ
నొప్పిచేయకగా । ఒప్పిదంబుగా!
తప్పనేర్పి నాయొప్పు గంటివి ॥ తరమా ॥

వ్యసనా! నీప్రతాపము వినవేడుకగు చున్నది.

వ్యసనుడు-గే. పొగాకు గంజాయి పుడమిని వెలసె
పేకయు జూదము వినోదమాయె
కాఫీసారా ఘనమును జెందె
రేలను తిరుగుట మేలనిపించె
నేనేఘనుడను నిక్కము దేలె
వినుమోదేవర! విన్నపమిదియె.

మృ—గే. బలేవ్యసననీబలంబుదలపగభయంబొదవునాకైనగా
పరాజయముగని భజింపకుందురెప్రజల్ సచివనిను
జూడగా

తిమిరుడా ! నీ ఘనకార్యమును జెప్పుము.

తిమి—తే. గీ. వినుము జగదీశజనులకు కనులుమూసి
మంచిచెడ్డలనరసెడి మతిని బాపి
బారియగీములనెప్పుడు మురియునట్లు
చేసినాడను దేవర చిత్తగింపు.

మృత్యు—గే. ఏరీ, నీసరివారలు, ఈ
రేడు లోకములుగన నేరీ
ధారుణి నొకపరి ధ్వంసము చేసెడి
నేరుపు గల్గిన వీరుడవౌదువు॥ ఏరీ॥

తే. గీ. సంతసించెను నామది సచివులార
మీదు సాయంబు గొనియాడ మేరగాదు
అమిత తిమిర వ్యసన మలినాదులుండ
దిగ్విజయమందకుందునే ధీరులార !

ద్వారికుడు—(ప్రవేశించి) సామీ ! మనోళ్లు పమత్తపురా
న్నుంచి ఉరుక్కుంటూ వొత్తున్నారు.

మృత్యు—శీఘ్రముగా ప్రవేశపెట్టుము.

(ద్వారికుడు నిష్క్రమించును.)

మంత్రులారా ! వీరిప్పుడు వచ్చుటకు కారణమేమై
యుండును ?

వ్యస—వారు వచ్చియే యున్నారు.

(భటులేడ్చుచు ప్రవేశము)

మృత్యు—ఏమి ? యిట్లేడ్చుచున్నారు, సత్వరముగా జెప్పుడు.

భటులు—పమత్తరాజు సచ్చిపోనాడంట, ఆరికొడుకు పజా
యితుడంట. దేశాలు తిరిగొచ్చి పజలకి కొత్త సట్టాలు
పెట్టాడంట. పెజలు మమ్మల్ని నిలనీక సావగొట్టేశారు.

మృ-మ. వేగపొండిక శత్రుసేనల చెండిగొట్టుడి మానకన్
జాగుసేయక గెల్పుతెల్పిన చాలసంతసమొందెదన్

మంత్రు-ఏగుచుంటిమి శత్రులందరి నింతలోపల జంపమే
దాగియున్నను బట్టితెత్తుము ధారుణీధవనమ్ముడీ.

(అందరు నిష్క్రమింతురు.)

నాల్గవరంగము.

(ప్రవేశము—అజ్ఞానుడు: అశ్రద్ధుడు)

అజ్ఞా—అబ్బ! కాలికొలది పరుగిడి యెట్టకేల కీగుట్ట జేరితిని. చీకటి నల్గడల దట్టముగ గ్రమ్మియున్నది. నన్ను వెంబడించెడి శత్రులింక యిండ్లకు మరలియుందురు. ఎట్టికాలము వచ్చెను. నేటివరకు జనుల మనంబుల జొచ్చి పీల్చి పిప్పి జేసితినిగదా! పేకాట, జూదము, పొగాకు, గంజాయి, కల్లు, సారా—ఇంకనెన్నియో యభ్యాసములకు బానిసలైయున్న వారిప్పుడన్నిటిని మానివేసిరి. వేళపట్టున భోజ

నము, నిద్ర, విశ్రాంతి, స్వచ్ఛోదకమును ద్రాగుట, శుద్ధవాయువు పీల్చుట, తీరికయైనపుడెల్ల భగవంతుని ధ్యానించుట-యిట్టి మార్గముల నవలంబించి నన్నేవగించు చున్నారు. ప్రజాహితుడట! చట్టముల నేర్పరచెనట! ఇవెంతకాలము సాగునో చూచెద. ప్రస్తుత మీగుహలో తలదాచుకొందును.

అశ్రద్ధుడు-(ప్రవేశించి) అమ్మయ్య! నన్నుతరుముచుండినశత్రువులిప్పటికి నన్ను వదలిరి. కొంతకాల మీ గుహలో దాగి యుండెద. ...ఇచ్చటెవ్వరో పరుండి యున్నట్లు తోచు చున్నది.

అజ్ఞా—ఇతడెవరో నే నెరిగినవాడని కంఠధ్వని వలన తోచు చున్నది. ...ఓహో! అశ్రద్ధా!

అశ్ర—మిత్రమా! అజ్ఞానా! నీవా. నీకును నాగతియే పట్టెనా? అమిత వ్యసనాదు లేమైరి?

అజ్ఞా—శుచి మహాదేవుని ధాకకు తాళలేక పలాయితులైరి. నీ వృత్తాంతమేమి?

అశ్ర—తిమిరుడు, మలినుడు చాలవరకు పోరుసల్పి తుదకు నావలె వారును నే యడవినోచేరి యుందురు. ప్రజాహితుని శాసనములకు మనము నిలువగలమా? శుచి, వెలుతురు, గాలి యని ప్రజలు కలవరించుచుండ మనము నిలుచుటకు నీడ యెక్కడ?

అజ్ఞా—మిత్రమా ! చింతిల్లకుము. మంచిదినములు వచ్చువరకును మనమిద్దర మిచ్చటనే వేచియుందము. చాల రాత్రి గడచెను. ఇంక నిదురింతము.

(అవనిక జారును.)

ఐ ద వ ర ం గ ము .

ప్రజాహితుని దర్బారు.

ప్రవేశము—ప్రజాహితుడు; మంత్రులు.

ప్రజా— మంత్రివరులార చెప్పుడి మనుజులెల్ల
మన పురంబున సుఖముగ మనుచురయ్య ?
ప్రజల సౌఖ్యంబె శ్రేయంబు పాలకులకు
ప్రజల సేమంబు గూర్చని ప్రభువులేల ?

1, మంత్రి—దేవా! తమ దయవలన సర్వజనులు సుఖంబున నున్న వారలు. ఆరోగ్యనిబంధనలను చక్కగా ప్రచురించి వానిననుసరించునట్లు ప్రజలకు బోధించితిని. వారును సంతసమున నట్లాచరించు చున్నారు.

2, మంత్రి—దేవర సెలవిచ్చినతీరున గృహముల విశాలముగ బారులు తీర్చి కట్టించితిని. గాలి, వెలుతురు ధారాళముగా వచ్చునట్లు తలుపులు కిటికీలు నమర్చబడినవి.

ప్రజా—నీటి సదుపాయ మెట్లు జరుపబడెను ?

3. మంత్రి—త్రాగెడు నీటికై యొక చెరువు ప్రత్యేకింప బడినది. అందెవ్వరు కాలుపెట్టకుండ నొకని నియమించితిని. అతడే వలయువారికి నీరు ముంచి గట్టుకు తెచ్చి పోయుచుండును. బావులపైనుండి మురికినీరు బావులలోనికి పోకుండ వాని చుట్టు రాళ్ళను పరిపించితిని.

4. మంత్రి—చెత్తనుపురమునుండి పొలములకు గొనిపోవుటకు బండ్లను నియమించితిని. ఇప్పుడు గృహములమధ్య నొక్క ప్రోగైనను లేదు.

ప్రజా—బాగు, బాగు !

1. మంత్రి—మురికి నీరు పోవుటకు కాల్వల త్రవ్వించితి. ఆ కాల్వల ప్రతి దినము నూడ్పించుచుంటిని.

2. మంత్రి—అనుదినము నుదయమున స్నానముచేసి శుభ్రమైన దుస్తులను ధరింప నాజ్ఞనిచ్చితిని. తమసెలవుప్రకారమందరును శుచిమహాదేవుని గొల్చి యారోగ్యమును బడయుచున్నారు.

ప్రజా—సెబాస్.

తే. గీ. మాటజవదాటకుండెడి మంత్రులుండ
భయము భక్తియు గల్గిన ప్రజలువెలయ
ఎల్లజీవులగాచు సర్వేశుడుండ
రాజుకెప్పుడు లోపంబు రాదునుండి.


మరియు నిట్లగుగాక.

భరతవాక్యము.

తే. గీ. ఎల్లసౌఖ్యములందును నేదిలెస్స
ఎల్ల భాగ్యములందును నేదిఘనము
ఎల్లయాశల సమకూర్ప నేదితగును
అట్టి యారోగ్యము జనుల కమరుగాత !

మంగళము.





మా పుస్తకము దొరుకును
పుస్తకమండలి
బెజవాడ

విద్యాశాఖాధికారులవలన [illegible]
కాబడిన పుస్తకములు

రామా మొదటివాచకము	0 [illegible]
రామా రెండవవాచకము	0 [illegible]
క్రొత్తమొదటి (శిశుతరగతి నాటకములకథలు) I వ క్లాసు	0
క్రొత్తరెండవతరగతి నాటకములకథలు II వ క్లాసు	0
క్రొత్తమూడవతరగతినాటకములకథలు III వక్లాసు	0
క్రొత్తనాల్గవ తరగతి నాటకములకథలు IV వక్లాసు	0
క్రొత్తఐదవతరగతి నాటకములకథలు V వక్లాసు	0
కిండరుగార్టెను డ్రిల్లు	0
ఆరోగ్యబోధిని 4, 5 తరగతులకు	0
హిందూదేశచరిత్ర-క్రొత్త 4 వ క్లాసుకు	0
నీతికథామంజరి 2, 3, 4, 5 తరగతులకు	0
లోకజ్ఞానము 2 వ క్లాసుకు	0
డిటో III వ క్లాసుకు	0
డిటో IV వ క్లాసుకు	0
సివిక్సు మ్యాన్యుయల్ 4, 5 తరగతులకు	0
మృగముల డ్రాయింగుబుక్కు	0
పక్షుల డ్రాయింగుబుక్కు	[illegible]
ప్రభుభక్తికీర్తనలు పద్యములు	[illegible]
నోట్సు ఆఫ్ లెసన్సు	[illegible]

వెంకటరాం కంపెనీ-[illegible]